సాక్షి
నిర్మల్
శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



మౌలిక వసతుల కల్పనకు కృషి

ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని నాందేడ్ రైల్వే డీ ఆర్‌ఎం నునితి సర్కార్ పేర్కొన్నారు. గురువారం రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. 10లో▸

12న వాహనాల వేలం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో సీజ్ చేసిన 41 వాహనాల కోసం ఆరు నెలలుగా ఎవరూ రాకపోవడంతో ఈనెల 12న సాయుధ దళ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వివరాలకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలంలోని ఎంటీ విభాగం 8519993462 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. వేలంలో పాల్గొనేవారు గుర్తింపు కార్డులతో హాజరుకావాలని తెలిపారు.

గరిష్టం/కనిష్టం
36.3 /24.6

వాతావరణం

ఆకాశం చాలావరకు మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. మధ్యాహ్నం తర్వాత చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. వాతావరణం చల్లబడుతుంది



న్యూస్‌రీల్

సాధారణ ప్రసవాలపై దృష్టి పెట్టాలి


ఆసుపత్రి వైద్యులతో కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆస్పత్రిని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం సాధారణ ప్రసవాలపై అవగాహన కలిగించే రూం చిన్నగా ఉందని, పక్కనే మరో గది ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దేవేందర్‌రెడ్డి, డాక్టర్లు రజిని, మమత, వాసు హెడ్ నర్సులు హేమలత, రాంబాయమ్మ మిడ్ వైఫరీ జన తదితరులు ఉన్నారు.

'ఆత్మీయ సమ్మేళనం' ఏర్పాట్లు పరిశీలన


బుల్లెట్ బండి పై బయలుదేరుతున్న మంత్రి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ పట్టణం బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయ సమీపంలో శుక్రవారం నిర్వహించే బీఆర్‌ఎస్ పట్టణ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాట్లను మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గురువారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో బుల్లెట్ బండిపై ఇంటికి వెళ్లారు. ఆయన వెంట అల్లోల గౌతమ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజి రాజేందర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, పట్టణ కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

బీటీ రోడ్డును పరిశీలించిన డీఎఫ్‌వో


రోడ్డును పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

దస్తురాబాద్: మండలంలోని గోడిసిర్యాల - గోండుగూడా పంచాయతీ పరిధిలోని బీటీ రోడ్డును జిల్లా అటవీశాఖ అధికారి డాక్టర్ సునీల్ ఇరామత్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్యాల గ్రామం నుంచి గోడిసిర్యాల గోండుగూడా గ్రామం మీదుగా రేవోజీపేట ఎక్స్‌రోడ్డు వరకు నిర్మించే బీటీ రోడ్డు అటవీశాఖ పరిధిలోకి వస్తుందన్నారు. అటవీ శాఖ అనుమతులు లేనందున బీటీ రోడ్డు పనులు నిలిపివేశామని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బీటీ రోడ్డు నిర్మాణంలో అటవీ భూమి ఎంత కోల్పోతుందో సర్వే నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. అనంతరం గోడిసిర్యాల రాజరాజేశ్వర ఆలయంలో డీఎఫ్‌వో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఎఫ్‌డీవో కోటేశ్వర్‌రావు, ఎఫ్‌ఆర్వో అనిత, డీఆర్వో సిదార్థ, ఎఫ్‌బీవో లక్ష్మీనర్సయ్య అటవీ శాఖ సిబ్బంది ఉన్నారు.

'పది' పరీక్షలకు 9 మంది గైర్హాజరు

నిర్మల్‌రూరల్: జిల్లాలో గురువారం జరిగిన పదో తరగతి పరీక్షలకు 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 9,039 మంది విద్యార్థులకు 9,030 మంది హాజరయ్యారు. రెగ్యులర్ కేటగిరీలో 9,034మంది విద్యార్థులకు 9,025 మంది హాజరవగా 9 మంది గైర్హాజరైనట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ప్రైవేట్ కేటగిరీలో ఐదుగురురికి ఐదుగురు పరీక్ష రాశార ని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా కలెక్టర్ వరుణ్ రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, విద్యాశాఖ ఆర్జేడీ స త్యనారాయణరెడ్డి, డీఈవో రవీందర్ రెడ్డి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఆర్జేడీ, డీఈవో కలిసి దిలావర్‌పూర్, నర్సాపూర్, కుంటాల, జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మొబైల్ ఫోన్లను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించొద్దని సూచించారు.

ఎండ ప్రచండం


నిర్మానుష్యంగా నిర్మల్ రోడ్డు..

- ఇప్పుడే 40 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత
- బయటకు వెళ్లాలంటేనే భయం
- పగటిపూట రోడ్లన్నీ నిర్మానుష్యం
- ఈ నెలలోనే 45 డిగ్రీలకు చేరే చాన్స్

నిర్మల్: ఈసారి ఎండ మండిపోతోంది. ఏప్రిల్‌లోనే భానుడు నిప్పులు కక్కుతున్నాడు. దీంతో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. సాధారణంగా జిల్లాలో ఏప్రిల్ నాలుగో వారం, మేలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ఈసారి మార్చిలోనే 35–38 డిగ్రీలు దాటింది. ఈనెల ప్రారంభం నుంచే 38 డిగ్రీలకుపైగా నమోదవుతూ భయపెడుతోంది. తాజాగా గురువారం 41.4 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లా జనం భయపడుతున్నట్లే ఈనెలలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. పదో తేదీ తర్వాత 43 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతాయని నివేదికలు చెబుతుండటం బెంబేలెత్తిస్తోంది. ఎండలో సాధ్యమైనంత వరకు తిరుగవద్దని, కచ్చితంగా తగు జాగ్రత్తలతోనే బయటకు వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు.


గొడుగు నీడన కూరగాయల విక్రయం..

8 గంటలకే సుర్రుమంటున్నాడు..

ఉదయం 8 గంటల నుంచి సూర్యుడు సుర్రుమంటున్నాడు. మధ్యాహ్నం 11–12 నుంచి సాయంత్రం 4–5 గంటల వరకూ అస్సలు తగ్గడం లేదు. ప్రచండమైన ఎండతో రోజంతా మండిపోతున్నాడు. ఉదయం 9–10 గంటల సమయంలో ఆఫీసులు, పనులకు వెళ్లేవారు బయటకు అడుగుపెట్టాలంటేనే జంకుతున్నారు. ఇక మధ్యాహ్నం పూట రోడ్డెక్కడానికి భయపడాల్సిన పరిస్థితి. జిల్లాకేంద్రంతోపాటు మండలాల్లోనూ మిట్టమధ్యాహ్నం నుంచి సాయంత్రం 4 గంటల వరకు అప్రకటిత కర్ఫ్యూ కొనసాగుతోంది. ప్రధాన రహదారులపై కూడా జనాలు కనిపించడం లేదు. అత్యవసర పనులపై వెళ్లేవాళ్లు మినహా మిగితా ఎవరూ రోడ్డెక్కడం లేదు.

రెండో వారంలో నిప్పులే..

ఈనెల మొదటివారంలోనే జిల్లాలో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీ సెల్సియస్‌కు చేరుకున్నాయి. క్రమంగా పెరుగుతూ రెండోవారంలో ఉధృతంగా మారనున్నట్లు వాతావరణ శాఖ నివేదికలు చెబుతున్నాయి. 13 తేదీ నుంచి ఏకంగా 44–45 డిగ్రీల సెల్సియస్ నమోదవుతాయని పేర్కొంటున్నాయి. ఇప్పుడే ఇంత వేడి ఉంటే.. రెండోవారం నుంచి ఎండను ఎలా తట్టుకోవాలని జిల్లావాసులు బెంబేలెత్తుతున్నారు. ఉద్యోగం, ఉపాధి పనులు చేసుకోవాల్సిన వాళ్ల తమ పరిస్థితి ఎలా ఉంటుందోనని కంగారు పడుతున్నారు.

చల్లదనం కోసం..

రెండువారాలుగా ఎవరింట్లో చూసినా కూలర్లు, ఫ్యాన్లు, ఏసీలను పెట్టుకోవడం, పాతవాటికి మరమ్మతులు చేయించడం వంటి పనులు కొనసాగుతున్నాయి. మెకానిక్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ దుకాణాల్లోనూ కుప్పలుగా ఇవే కనిపిస్తున్నాయి. ఎలక్ట్రీషియన్లు, మెకానిక్‌లు కూలర్లు, ఫ్యాన్లకు సంబంధించిన పనుల్లోనే బిజీగా ఉన్నారు. కొత్తకూలర్లు, ఏసీల కొనుగోళ్లు కూడా గత ఏడాదితో పోలిస్తే ఈసారి పెరుగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. వీటితోపాటు ఫ్రిజ్‌ల కొనుగోలు కూడా పెరుగుతోంది. ఎండలో ఎక్కువగా తిరిగేవారు టోపీలు, రుమాళ్లను కొనుగోలు చేస్తున్నారు.

అత్యధిక ఉష్ణోగ్రతల వివరాలు (డిగ్రీ సెల్సియస్‌ల్లో)

తేదీ	గరిష్టం	కనిష్టం
05	41.4	20.1
06	38	24
07	38	25
08	38	23
09	41	27
10	41	28
11	43	26
12	44	27
13	45	27
14	44	28



జాగ్రత్తగా ఉండాలి..



గత ఏడాదికంటే ఈసారి ఎండలు ఎక్కువగానే ఉన్నాయి. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్నం ఎండలో తిరగకపోవడం ఉత్తమం. కూల్‌డ్రింక్స్ లాంటివి కాకుండా నీళ్లు, మజ్జిగ, కొబ్బరినీళ్ల వంటివి ఎక్కువగా తాగాలి. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వారికి సంబంధించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలాంటి ఇబ్బంది ఉన్నా వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ రత్నాకర్‌రెడ్డి, ఎండీ, నిర్మల్

జాగ్రత్తగా ఉండాల్సిందే..

ఎండాకాలం ఏమవుతుందిలే.. అని అజాగ్రత్త ఉండొద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈసీజన్‌లో బయట తిరిగేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని లేనిపక్షంలో వడదెబ్బ ప్రాణాంతకంగా మారుతుందని చెబుతున్నారు. తప్పని సరి అనుకుంటేనే ఎండలో బయటకు వెళ్లాలని సూచిస్తున్నారు.

- తలకు టోపీ పెట్టుకోవడంతో కళ్లు, చెవులకూ రక్షణ అవసరం.
- కళ్లకు కూలింగ్ అద్దాలు, చెవులకు దస్తీ చుట్టుకోవడం తప్పనిసరి. ప్రధానంగా బైక్‌పై బయటకు వెళ్లేవారు కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎండతోపాటు వడగాల్పుల నుంచి రక్షణ కోసం ఈ జాగ్రత్తలు పాటించాలి.
- చిన్నారులు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి. వారు అడగకున్నా.. తరచూ నీళ్లు, పండ్లరసాలు, ఓఆర్‌ఎస్ తాగిస్తుండటం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.
- కళ్లు తిరగడం, నీరసం, డీహైడ్రేషన్ లక్షణాలు కనిపించిన వెంటనే ప్రాథమిక చర్యలు తీసుకుని వైద్యులను సంప్రదించాలి.
- ఎండలో నుంచి రాగానే నీళ్లు తాగకుండా.. కాసేపు ఆగిన తర్వాత తీసుకోవాలి.
- ఏ పని ఉన్నా.. దాదాపుగా ఉదయం, సాయంత్ర వేళల్లో చేసుకోవడం ఉత్తమం.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు రండి

- నియోజకవర్గానికి 300 మందికి ఆహ్వానం
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్మించిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఈనెల 14న చేయనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు సమన్వయంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను భాగస్వాములు చేయాలని సూచించారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ, గొర్రెల పంపిణీ కార్యక్రమాలపై కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14న అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆరు బస్సుల్లో 300 మంది చొప్పున హైదరాబాద్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల లోపే విగ్రహావిష్కరణ సభా వేదిక వద్దకు ప్రజలు చేరుకునేలా చూడాలన్నారు. ప్రతీ బస్సులో ఒక పోలీస్ కానిస్టేబుల్‌తోపాటు అధికారి ఉండేలా చూడాలన్నారు.

గొర్రెల పంపిణీకి సన్నద్ధం కావాలి...

రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం త్వరలోనే శ్రీకారం చుట్టే అవకాశం ఉన్నందున, ఆలోపే ఈ పథకం అమలు కోసం క్షేత్రస్థాయిలో అన్నివిధాలుగా సన్నద్ధం కావాలని సీఎస్ కలెక్టర్లకు సూచించారు. ముఖ్యంగా లబ్ధిదారుల ఎంపిక, అవగాహన కల్పించడం, ఇతర రాష్ట్రాల నుంచి గొర్రెల కొనుగోలు, వాటి రవాణా, నిర్దేశించిన ధ్రువీకరణ పత్రాల పంపిణీ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్డీవో లోకేశ్, ఆర్డీవోలు స్రవంతి, రవికుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి ఆర్టీసీ డిపో మేనేజర్ సాయన్న, పశు సంవర్ధకశాఖ అధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ 'లంపీస్కిన్'

- పశువులను వెంటాడుతున్న వ్యాధి
- ఆవుజాతి లేగ దూడల్లో ఎక్కువ
- మిగతా వాటికి పొంచి ఉన్న ముప్పు
- 80.2 శాతం జీవాలకే వ్యాక్సినేషన్
- ఆందోళనలో రైతులు

లోకేశ్వరం: జిల్లాలోని పశువులను ప్రాణాంతకమైన లంపీస్కిన్(ముద్దచర్మం) వ్యాధి వెంటాడుతూనే ఉంది. వ్యాధి లక్షణాలు తెల్లజాతి పశువుల్లో మళ్లీ కనిపిస్తున్నాయి. దీంతో పశువుల యాజమానులు ఆందోళన చెందుతున్నారు. ఐదు నెలల క్రితం జిల్లాలోకి ప్రవేశించిన వైరస్‌తో రైతులు ఆందోళన చెందారు. అప్రమత్తమైన పశువైద్యాధికారులు ముందస్తుగా రోగనిరోధక శక్తి పెంచే వ్యాక్సిన్లు వేశారు. రెండు నెలల క్రితం మరోమారు భైంసా డివిజన్‌లో లంపీ స్కిన్ వెలుగు చూసింది. తాజాగా వారం రోజులుగా మళ్లీ వైరస్ విజృంభిస్తోంది. పశువుల్లో లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకటి రెండు లేగదూడలు వ్యాధితో మృతిచెందినట్లు కూడా రైతులు చెబుతున్నారు.


కుంటాలలో లంపీ స్కిన్ వ్యాధి సోకిన పశువుకు చికిత్స చేస్తున్న పశువైద్య సిబ్బంది

నాలుగు మండలాల్లో వైరస్..

జిల్లాలోని భైంసా, కుంటాల, లోకేశ్వరం, ముధోల్ మండలాలతోపాటు జిల్లా కేంద్రంలోని ఆవుజాతి లేగ దూడలకు ఎక్కువగా లంపీ స్కిన్ సోకుతోంది. ఈమేరకు వ్యాధి లక్షణాలు కూడా స్పష్టంగా బయటపడుతున్నాయి. తెల్లజాతి పశువుల్లోనే వ్యాధి ఎక్కువగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఈగలు, దోమలు, పిడుదులు, గోమర్లతో ఈ వైరస్ వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయి.

లక్షణాలు ఇవీ..

శరీరంపై 2 నుంచి 5 సెంటీమీటర్ల విస్తీర్ణంలో గుండ్రంగా దద్దుర్లు, కురుపులు ఏర్పడతాయి. జ్వరం వస్తుంది. ఆకలి మందగిస్తుంది. పాల ఉత్పత్తి తగ్గుతుంది. చూడి పశువుల్లో గర్భస్రావం అవుతుంది. వ్యాధి తీవ్రంగా ఉండి చికిత్స అందకపోతే పశువు మరణించే అవకాశాలు ఉన్నాయి.

జిల్లాలోని పశువుల వివరాలు..

తెల్లజాతి పశువులు	1,75,615
నల్లజాతి పశువులు	1,35,314

లేగ దూడకు వ్యాధి సోకింది



నాకు నాలుగు ఆవులు ఉన్నాయి. ఇటీవల లేగదూడ పుట్టింది. దానికి లంపీ స్కిన్ వ్యాధి సోకింది. చికిత్స కోసం దగ్గరలో ఉన్న పశు వైద్యులకు చూపించాను. రూ.3 వరకు ఖర్చు చేశాను. అయినా లేగ దూడ బతక లేదు. టీకా వేయించకపోవడంతోనే లేగదూడ చనిపోయింది. వ్యాధి సోకకుండా అందరూ టీకాలు వేయించాలి. – రమణ, వట్టోలి

పశువైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం

జిల్లాలో లంపీ స్కిన్(ముద్ద చర్మ) వ్యాధి లక్షణాలు మళ్లీ బయటపడుతున్నాయి. ఇప్పటికే పశువైద్యులు, సిబ్బందిని అప్రమత్తం చేశాం. రైతులు జాగ్రతగా ఉండాలి. లక్షణాలు కనపడగానే పశువును మంద నుంచి వేరు చేసి క్వారంటైన్‌లో ఉంచాలి. మండల పశువైద్యాధికారికి సమాచారం అందించాలి. లేగ దూడలకు వైరస్ ఎక్కువ సోకుతుంది. టీకాలు చేయించాలి.

– శంకర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

అందుబాటులో టీకాలు...

గతంలో ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన పశువులతోపాటు దాని పరిసరాల్లోని 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న వాటికీ ఎల్‌ఎస్‌డీ టీకాలు వేశారు. ప్రతీ పశువైద్య ఆస్పత్రిల్లో ఎల్‌ఎస్‌డీ టీకా అందుబాటులో ఉంది. ప్రతీ దూడకు రైతులు టీకా తప్పని సరిగా వేయించాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 80.2 శాతం పశువులకే వ్యాక్సిన్ వేసినట్లు పేర్కొంటున్నారు. మరో 20 శాతం పశువులకు రైతులు టీకాలు వేయించలేదని తెలిపారు. టీకాలు వేయించని వాటికే లంపీ స్కిన్ సోకుతోందని పశువైద్యులు తెలిపారు. టీకా వేస్తే ఏడాదిపాటు వైరస్ నుంచి రక్షణ లభిస్తుంది.

పబ్లిక్ వెల్ఫేర్ సొసైటీకి నిధులు చెక్కుల రూపంలో ఇవ్వాలి


ఎస్పీకి చెక్కు అందిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పబ్లిక్ వెల్ఫేర్ సొసైటీకి దాతలు ఇచ్చే నిధులు చెక్కుల రూపంలోనే ఇవ్వాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఇటీవల కొంతమంది దాతలు ఇచ్చిన నిధులకు సంబంధించిన రూ.30 లక్షల చెక్కులను గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి జిల్లా ఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మంత్రి సహకారంతో ఈ సొసైటీని ఏర్పాటు చేసి వ్యాపారవర్గాల వారికి అవగాహన కల్పించడంతో ఈ సొసైటీకి నిధులు సమకూర్చేందుకు దాతలు ముందుకు రావడం హర్షనీయమన్నారు. పబ్లిక్ వెల్ఫేర్ సొసైటీకి ఇచ్చే నిధులకు ట్యాక్స్ మినహాయింపు ఉంటుందని తెలిపారు. ఈ నిధులతో ప్రజలకు ఆరోగ్య శిబి రాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులను ఆదుకోవడానికి, సామాజిక సేవ కార్యక్రమాలకు వినియోగించడం జరుగుతుందని వివరించారు. వ్యాపారులు అధిక సంఖ్యలో ముందుకు వచ్చి సామాజిక సేవలో భాగస్వాములు కావాలని కోరారు. ఇప్పటికే విరాళాలు ఇచ్చినవారికి కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


మాట్లాడుతున్న రమాదేవి

భైంసాటౌన్/కుంటాల: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కుంటాల మండలం కల్లూర్, అందాకూర్ గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పి.రమాదేవి పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కేంద్రం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమాల్లో బీజేపీ భైంసా పట్టణాధ్యక్షులు మల్లేశ్వర్, ఎడ్ల నాగనాథ్, సంపత్‌పటేల్, గౌతం పింగ్లే, సాహెబ్‌రావు, కోర్వ సచిన్, లక్ష్మణ్, వెంకటేశ్, అనిల్, కుంటాల ఎంపీపీ అప్క గజ్జారాంయాదవ్, మండల కన్వీనర్ నర్సయ్య, ఎంపీటీసీ కట్ట రవి, తాటి శివ, పసుల నవీన్, కళ్యాణ్ గజేందర్, రజినీకాంత్‌రావు, రమాకాంత్‌రావు, లక్ష్మణ్ పటేల్, వెంకట్, ప్యాదరి భూమన్న, రాధాకృష్ణ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం తనిఖీ చేసిన స్టేట్ అబ్జర్వర్

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని వరంగల్ ఆర్జేడీ, స్టేట్ అబ్జర్వర్ సత్యనారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ రాంబాబు, డీఈవో రవీందర్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. మొత్తం 192 మంది విద్యార్థులకు అందరూ హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ నాగన్న తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని పేర్కొన్నారు.


పూజలు చేస్తున్న మహిళలు




దక్షిణాముఖి హనుమాన్ ఆలయంలో ఆంజనేయస్వామి, హనుమాన్ వద్ద మారుతి..


హనుమాన్ ఆలయంలో భక్తుల సందడి

అంజనీపుత్రా... పాహిమాం

హనుమాన్ చిన్న జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ ఆలయాలన్నీ భక్తుల జై హనుమాన్ నామస్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే భక్తులు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. చందనం, తమలపాకు పూజలు చేశారు. ఆలయ కమిటీలు, హనుమాన్ సేవా సమితుల ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. పట్టణంలోని కూరన్నపేట్, బాలాజీవాడ, గాంధీచౌక్, గాజులపేట, చింతకుంటవాడ, బోయినవాడ, భాగ్యనగర్, కళానగర్, ప్రియదర్శినినగర్, శాస్త్రినగర్, హనుమాన్ ఆలయాల్లో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పూజలు చేశారు. – నిర్మల్‌చైన్‌గేట్

ఎస్సై తుది పరీక్షలకు ప్రత్యేక బస్సులు



నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర పోలీసు నియామక బోర్డు ఆధ్వర్యంలో ఈనెల 8, 9 తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించే ఎస్సై తుది పరీక్షలకు ప్రత్యేక బస్సులు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్టీసీ నిర్మల్ డిపో మేనేజర్ సాయన్న ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్ నుంచి కరీంనగర్‌కు ఉదయం 4.30 గంటలకు ప్రత్యేక బస్సులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అభ్యర్థులు నిర్మల్ బస్టాండ్ కౌంటర్ వద్ద గానీ, ఆన్‌లైన్‌లో www.tsrtconline.in వెబ్‌సైట్‌లో గానీ రిజర్వేషన్ చేసుకోవాలని తెలిపారు.

క్లుప్తంగా

నేడు అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు

కుంటాల: మండల కేంద్రంలోని మహాదేవుని పౌర్ణమి, హనుమాన్ జయంతి సందర్భంగా శుక్రవారం అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ దొనికెన సమత వెంకటేష్ తెలిపారు. మల్లయోధులు పెద్ద సంఖ్యలో హాజరై కుస్తీ పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

మినీ గురుకులాల్లో అడ్మిషన్లు ప్రారంభం

నార్నూర్/ఉట్నూర్: మినీ గురుకులాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్సీవో గంగాధర్ తెలిపారు. గురువారం ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఆయన మాట్లాడారు. ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు సీట్ల భర్తీ చేయనున్నట్లు తెలిపారు. నేటి వచ్చే నెల నాల్గో తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్



బండ శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా ఆదిలాబాద్ పట్టణానికి చెందిన బండ శ్రీనివాస్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఉత్తర్వులు గురువారం జారీ చేశారు. చేనేత ఐక్యవేదిక కార్మికుల పరిరక్షణ కోసం కృషి చేయాలని సూచించారు.

మొక్కజొన్న పంట దగ్ధం



దగ్ధమైన మొక్కజొన్న పంట

లోకేశ్వరం: మండలంలోని గొరోల్ల పెద్ద భూమన్నకు చెందిన మొక్కజొన్న పంట విద్యుత్‌షాక్‌తో దగ్ధమైంది. వివరాల ప్రకారం ... భూమన్న యాసంగిలో ఎకరం మొక్కజొన్న పంటసాగు చేయగా ఇటీవల పంటకొసి చేనులో అరబెట్టాడు. తన చేనులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో నుంచి బుధవారం రాత్రి నిప్పురావడంతో ఎకరం మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. దీంతో రూ.80వేల పంట నష్టం జరిగిందని రైతు వాపోయాడు. పంట నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అన్నం తినేందుకు వెళ్తూ అనంతలోకాలకు..

- ప్రమాదవశాత్తు బస్సు ఢీకొని కండక్టర్ మృతి
- మంచిర్యాల ఆర్టీసీ డిపో గేటు ఎదుట ఘటన
- మృతుడు ఆదిలాబాద్ డిపోకు చెందిన కండక్టర్



గంగారాం (ఫైల్)



ఘటనాస్థలంలో గంగారాం మృతదేహం

మంచిర్యాలక్రైం/ఆదిలాబాద్: విధి నిర్వహణలో ఉన్న ఓ ఆర్టీసీ కండక్టర్ అన్నం తినేందుకు వెళ్తూ ప్రమాదవశాత్తు బస్సు టైరు కిందపడి మృతి చెందిన ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో గేటు ఎదుట చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం భరంపూర గ్రామానికి చెందిన బాతూరి గంగారాం (54) ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా గురువారం ఉదయం ఆదిలాబాద్ నుంచి బయలుదేరగా 10.50 గంటలకు మంచిర్యాల బస్టాండ్‌కు చేరుకున్నారు. ఇంకా 15, 20 నిమిషాల టైం ఉండడంతో డ్రైవర్ బస్సును పాయింట్ మీద నిలిపారు. కండక్టర్ గంగారాం భోజనం చేసేందుకు టిఫిన్ బాక్స్ పట్టుకుని డిపోలోకి వెళ్తున్నాడు. అప్పటికే హైదరాబాద్ నుంచి వచ్చిన సూపర్ లగ్జరీ బస్సు డిపో లోపలికి వెళ్లేందుకు సెక్యూరిటీ గది ముందు ఆగి ఉంది. డ్రైవర్ వాసాల తిరుపతి కుడివైపు ఉన్న కార్యాలయంలోని సెక్యూరిటీ అధికారులతో మాట్లాడుతున్నాడు. ఎడమవైపు నుంచి వచ్చిన గంగారాం లోనికి వెళ్తుండగా గమనించని డ్రైవర్ తిరుపతి బస్సును స్టార్ట్ చేశాడు. బస్సు ముందుకు కదలడంతో ఎడమవైపు నుంచి వచ్చిన గంగారాంను ఢీకొట్టింది. కండక్టర్ కిందపడిపోవడంతో గమనించకుండానే డ్రైవర్ బస్సును ముందుకు తోలడంతో వెనుకటైరు గంగారాం తల మీదినుంచి వెళ్లింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని చూసిన ప్రయాణికులు, తోటి కండక్టర్లు, డ్రైవర్లు కంటతడి పెట్టుకున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై తైసినొద్దీన్ ప్రమాద వివరాలు సేకరించి పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య పద్మ, కుమారుడు మనోజ్‌కుమార్, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డ్రైవర్ తొందరపాటే ప్రమాదానికి కారణమా?

మంచిర్యాల డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు హైదరాబాద్ నుంచి వచ్చింది. డిపోలో బస్సును అప్పగించి ఇంటికి వెళ్లాలన్న డ్రైవర్ తొందరపాటే ప్రమాదానికి కారణమైందని స్థానికులు, ఆర్టీసీ సిబ్బంది పేర్కొంటున్నారు. బస్సు కిందపడిన కండక్టర్ అరుపులు విని డ్రైవర్ అప్రమత్తమై ఉంటే ప్రాణనష్టం జరిగేది కాదని ఆర్టీసీ సిబ్బంది పేర్కొన్నారు.

వ్యాన్‌లో విద్యార్థుల తరలింపు



జిల్లాలో పదో తరగతి పరీక్షలు నడుస్తున్న నేపథ్యంలో ఖ్వారంగాపూర్ మండలం గంగాపూర్ సమీపంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలో పరీక్ష కేంద్రాలు కేటాయించారు. దీంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థులను డీసీఎం వ్యాన్ ద్వారా ఆయా పరీక్ష కేంద్రాలకు తరలిస్తున్నారు. పశువులను తరలించినట్లుగా విద్యార్థులను డీసీఎం వ్యాన్‌లో తరలించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- నిర్మల్‌చైన్‌గేట్

కుక్కల దాడిలో 16 జీవాలు మృతి

నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని అందాకూర్ గ్రామంలో కుక్కల దాడిలో ఆరు మేకపిల్లలు మృతిచెందగా... ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని దేవాపూర్ గ్రామంలో పది మేక పిల్లలు చనిపోయాయి. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.



మృతిచెందిన మేక పిల్లలు

కుంటాలలో ఆరు..

కుంటాల: మండలంలోని అందాకూర్ గ్రామంలో గురువారం కుక్కల దాడిలో బీరప్పకు చెందిన ఆరు మేకపిల్లలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బీరప్ప రోజు మాదిరిగానే మేకలను మేతకు తీసుకువెళ్లాడు. పశువుల పాకలో మేక పిల్లల ఉండగా కుక్కలు దాడి చేయడంతో ఆరు మేక పిల్లలు చనిపోయాయి. మరో రెండు మేక పిల్లల పరిస్థితి విషమంగా ఉంది. పశువైద్యాధికారి ప్రకాష్ ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. రెండు రోజుల క్రితం కుంటాలకు చెందిన కక్కెర ముత్యంరావు కు చెందిన మేకల మందపై కుక్కలు దా డి చేయడంతో రెండు మేకలు మృతి చెందిన ట్లు ఆలస్యంగా వెలు గుచూసింది. కుక్కల ను నియంత్రించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తలమడుగులో పది గొర్రెపిల్లలు..

తలమడుగు: మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన గొల్లేని స్వామి గొర్రెలు మేపడానికి వెళ్లాడు. గొర్రె పిల్లలను కొట్టంలో ఉంచాడు. గురువారం సాయంత్రం సమయంలో కుక్కలు కొట్టంలోకి చొరబడి దాడిచేయడంతో 10 గొర్రెపిల్లలు చనిపోయాయి. దీంతో బాధితుడు స్వామి ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని, అధికారులు కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నాడు. సంఘటన స్థలానికి మండల పశువైద్యాధికారి దూద్‌రామ్ రాథోడ్ చేరుకుని నిర్ధారించాడు.

నిన్ను సైతం తీసుకెళ్లాడా..!

- కుమారుడి మృతితో రోదించిన తల్లి..
- ఇటీవల భర్త మృత్యువాత
- కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు పనికి వెళ్తున్న బాలుడు
- టెంట్‌హౌజ్ సామగ్రి శుభ్రం చేస్తూ చెరువులో జారిపడిన వైనం



ఉడుత గణేష్ (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై



రోదిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు

సారంగపూర్: ఆ దేవుడు .. నిన్ను సైతం తీసుకెళ్లాడా గణేశా.. నాకు తోడుగా ఉంటావనుకుంటే ఇలా మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయావా అంటూ ఆ తల్లి రోదించిన తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించింది. ఇటీవల భర్త చనిపోగా ఇప్పుడు కుమారుడు సైతం మృతిచెందడంతో ఆ తల్లి గుండెలు అవిసెలా విలపించింది. స్థానికుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన ఉడుత నర్సయ్య, స్వప్న దంపతులకు నలుగురు సంతానం. ఇందులో ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కుమారులున్నారు. నర్సయ్య 11 నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి కుటుంబ బాధ్యత స్వప్నపై పడింది. తల్లి బీడీలు చుడితే వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో గమనించిన కుమారుడు గణేశ్(14) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటూనే టెంట్‌హౌజ్‌లో పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలిచాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం టెంట్‌హౌజ్‌లోని సామగ్రిని శుభ్రం చేసేందుకు అందులో పనిచేసే వారితో కలిసి స్థానిక అంబవాయి చెరువుకు వెళ్లాడు. వాటిని శుభ్రం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు గణేష్ చెరువులో జారి పడిపోయాడు. గమనించిన తోటి వారు టెంట్‌హౌజ్ యజమాని, గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. చీకటి పడడంతో గురువారం ఉదయం నుంచి మత్స్యకారుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం మృతదేహం లభ్యమైంది. చిన్న వయస్సులోనే కుటుంబ బాధ్యతలు తీసుకున్న కుమారుడి మృతితో ఆ తల్లి గుండెలు పగిలెలా రోదించింది. తల్లి ఫిర్యాదు మేరకు టెంట్ హౌజ్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ప్రాణం తీసిన ఇరుకురోడ్డు..



ధర్మపురి మృతదేహం

ఖానాపూర్: రోడ్డు ప్రమాదానికి గురైన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై ఆర్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పద్మావతినగర్ కాలనీకి చెందిన కారింగుల ధర్మపురి (72) గురువారం విద్యానగర్‌లోని పోస్టాఫీసుకు పెన్షన్ కోసం వెళ్లి బస్టాండ్ వైపు బైక్‌పై తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో బస్టాండ్ నుంచి విద్యానగర్ వైపు వెళ్తున్న అల్లెపు రవికి చెందిన కంకర ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ధర్మపురి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు 108లో ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇరుకు రోడ్డుతోనే ప్రమాదం...

పట్టణంలో ఏడాదిన్నర కాలంగా రోడ్డు వైడింగ్ పనులు నత్తనడకన సాగడమే ఈ ప్రమాదానికి కారణమైందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇరుకురోడ్డు కారణంగా ప్రతీరోజు పట్టణంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రతినెలా పింఛన్ కోసం ప్రధాన రహదారిలో పోస్టాఫీస్‌కు వృద్ధులు, మహిళలు, వికలాంగులు వస్తారని, ప్రమాదం పొంచి ఉందని పలువురు అంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

లక్ష్మణచాంద: బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని బాబాపూర్ చెక్ పోస్టు వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన రాజు (30) గ్రామ సమీపంలోని చేను నుంచి గురువారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేక్రమంలో బాబాపూర్ చెక్ పోస్టు వద్ద ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజుకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

పోక్సో కేసులో యువకుడి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రణదీవేనగర్‌కు చెందిన సాయినాథ్(22)ను పోక్సో కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రఘుపతి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ మైనర్‌ను పెళ్లి చేసుకుంటానని చెప్పి కుటుంబ సభ్యులకు తెలియకుండా ఇంటి నుంచి తీసుకెళ్లాడు. దీంతో ఆ బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈ నెల 4వ తేదీన మిస్సింగ్ కేసు నమోదైంది. సదరు యువకుడు మోసం చేయడంతో గురువారం పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేసింది. దీంతో పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: నార్నూర్ మండలం సుంగాపూర్‌కు చెందిన జాదవ్ జ్యోతిపై దాడి చేసిన ఇద్దరిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. జ్యోతి కూతురు ఐశ్వర్య పురుగుల మందుతాగి ఈ నెల 4వ తేదీన రిమ్స్‌లో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ సమయంలో జ్యోతి తన కూతురు వరకట్నం వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగింది. ఆ సమయంలో ఐశ్వర్య చిన మామ బండారి శ్రీరంగ్, ఆయన కుమారుడు దీపక్‌లు జ్యోతిపై దాడి చేశారు. దీంతో ఆమె పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యశ్వంత్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని మత్తడిగూడ గ్రామానికి చెందిన సలాం భూమన్న (25) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. భూమన్నకు ఏడాది క్రితం టాక్లీ గ్రామానికి చెందిన యువతితో వివాహమైంది. బుధవారం భార్యాభర్తలు కలిసి కాలినడకన టాక్లీ గ్రామానికి బయలుదేరారు. మార్గంమధ్యలో పక్కకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య బంధువులకు సమాచారం ఇచ్చింది. వెంటనే వారు చేరుకుని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు



ముధోల్‌లో కుస్తీ పోటీలు

ముధోల్: మండల కేంద్రంలోని జలశంకర ఆలయ ప్రాంగణంలో గురువారం గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. నిర్మల్ జిల్లాలోని వివిధ మండలాలతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు చెందిన మల్లయోధులు కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతకు రూ.5 వేల నగదు బహుమతి అందించారు. హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకుని ప్రతి సంవత్సరం వీడీసీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ పోటీలను తిలకించేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎస్సై సాయికిరణ్ నేతృత్వంలో పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, ఎంపీటీసీ సభ్యులు దేవోజి భూమేష్, సరళ శ్రీనివాస్‌గౌడ్, వీడీసీ అధ్యక్షుడు గుంజలోల్ల నారాయణ, ఫ్యాక్స్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, మాజీ ఎంపీపీ ఎజాజోద్దీన్, వీడీసీ ఉపాధ్యక్షుడు ఆనంద్‌రావుపటేల్, కార్యదర్శి నారాయణ, కోశాధికారి మేత్రి సాయినాథ్ ఉన్నారు.

బీజేపీ నాయకుల వినూత్న నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

ఖానాపూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పేపర్ లీకేజీ పేరుతో అక్రమ కేసులు బనాయించడం సరికాదని బీజేపీ నాయకులు గురువారం పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో వినూత్న నిరసన చేపట్టారు. కళ్లకు గంతలు కట్టుకుని, చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసనలో పాల్గొన్నారు. బీజేపీ నియోజకవర్గ నాయకురాలు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి మాట్లాడుతూ ప్రభుత్వం నిరంకుశ ధోరణితో అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందన్నారు. కేసుతో ఎలాంటి సంబంధం లేని బండి సంజయ్‌ని రాజకీయంగా ఎదుర్కొలేకనే తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. వెంటనే సంజయ్‌పై కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పడాల రాజశేఖర్, నాయిని సంతోష్, ఆకుల శ్రీనివాస్, తోకల బుచ్చన్న, అంకం మహేందర్, లాండేరి కిషన్, చందుపట్ల శ్రావణ్, దేశాయి రాము, ఇనుముల స్వామి, సిరిగారపు లింగన్న, గోపాల్ రెడ్డి, బుర్ర రమేశ్, లక్కవత్తుల రాజేశ్వర్, పిట్టల భూమన్న, ఆసం సాయి, జీవన్ ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



హనుమన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



హోమంలో పాల్గొన్న భక్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని వాల్గొండ గ్రామపంచాయతీ పరిధిలోని పొల్లుగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం హనుమన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్టాపన వైభవంగా నిర్వహించారు. గ్రామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కోడప వినాయక్‌రావ్ మహారాజ్ ప్రత్యేక పూజల మధ్య విగ్రహ ప్రతిష్టాపన చేశారు. అనంతరం గ్రామ ఆడపడుచులకు కొత్త వస్త్రలు అందించారు. సంప్రదాయంగా కలశాన్ని గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ఇంటింటా మహిళలు కలశానికి పూజలు చేశారు. ఇందులో ఇంద్రవెల్లి ఎస్సై సునిత్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు గోడం గణేష్, ఆదివాసీ సంఘాల నాయకులు పుర్కా బాపురావ్, పెందోర్ పుష్పరాణి హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ కోరెంగా శంభు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అడవులను పరిశీలించిన ఎఫ్‌సీఆర్‌ఐ విద్యార్థులు



సాసర్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

పెంబి: పెంబి రేంజ్ పరిధిలోని తాటిగూడ, పెంబి సెక్షన్ పరిధిలోని అటవీ ప్రాంతాన్ని, నీటి కుంటలు, నీటి తొట్టిలను ములుగు జిల్లాలోని (ఎఫ్‌సీఆర్‌ఐ) ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన 60మంది విద్యార్థులు గురువారం పెంబి ఎఫ్ఆర్‌వో రామకృష్ణా ఆధ్వర్యంలో సందర్శించారు. అడవిలోని చెట్ల రకాలు, అడవి జంతువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టిలు(సాసర్) పరిశీలించారు. వారి వెంట ఎఫ్ఎస్‌వోలు రవి, శ్రీనివాస్ ఉన్నారు.

క్షుద్రపూజల కలకలం...?



పరిశీలిస్తున్న ఎస్సై, తహసీల్దార్

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామ పొలిమేరలోని ఇండెన్ గ్యాస్ గోదాం వెనుక భాగంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తవ్వకాలు చేపట్టిన ఘటన కలకలం రేపింది. ఖానాపూర్‌కు చెందిన ముడికె మల్లయ్యకు చెందిన పంట పొలం వద్ద తవ్వకాలను చేపట్టారు. కాగా తవ్వకాలు చేసిన ప్రాంతంలో పసుపు, కుంకుమతో పాటు అగరుబత్తులు ఉండడంతో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఎస్సై శంకర్, తహసీల్దార్ రాజమోహన్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. దీంతో నిలువెత్తు తవ్విన గుంతలో మట్టి పూడ్చి ఉండడంతో అందులో ఏదైనా ఉందా అనే అనుమానంతో జేసీబీతో తవ్వకాలు చేపట్టినప్పటికీ ఎలాంటి ఆనవాళ్లు కనరాలేదు. తవ్వకాలు ఎందుకు చేశారనేది తెలియాల్సి ఉంది.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

బోథ్: మండలంలోని కుచులాపూర్ గ్రామంలో గురువారం రాత్రి 8.30గంటలకు సీరం సుదర్శన్ అనే వ్యక్తికి చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుదర్శన్ ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన కుటుంబీకులు వెంటనే బయటకు వచ్చారు. ఇంట్లోని వస్తువులు, నగదు, బట్టలు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిబూడిదయ్యాయి. అక్కడే ఉన్న బైక్ కాలిపోయింది. ఇచ్చోడ నుంచి ఫైరింజన్ రాగా గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంజేశారు. ఫైర్‌ఇంజిన్ ఎదుట ధర్నాకు దిగారు. గ్రామం నుంచి వెళ్లనివ్వబోమని రోడ్డుపై బైఠాయించారు.